# కళ్యాణా తార

ఉదయం ఇంకా అయిదైనా కాలేదు. దూరాన దూదేకుల సాయిబుగాడుకు చేస్తున్న సన్నాయిసాధన, చలిని చీల్చుకొని వచ్చి చెవుల్లో విచ్చుకత్తిలా గుచ్చుకుంటోంది. మధ్య మధ్య ఒక్కొక్క కోడి మాత్రం 'కొక్కొరోకో' అని అరుస్తూంది. ముందు ఇంటి ముసలమ్మ వీధిలో పేడనీళ్లు చల్లుతూ కోడల్ని పేరుపెట్టి పిలుస్తోంది. గోపాలానికి తిరిగి నిద్రపటడం లేదుగాని, లేవాలనీ లేదు. రాత్రి పన్నెండు వరకూ కూతురి పెళ్ళి విషయం భార్యతో వాదించాడు. ఆమె ఎంత చెప్పినా ఆ సైకిలు షాపు సుబ్బారాయుడికి పనేమిరా యివ్వనన్నాడు. ఆమెకు బుద్ధిచెబుతాననిఉదయమే బెంగుళూరు ప్రయాణం పెట్టుకున్నాడు. అటుపిమ్మట ప్రక్కలోని పిల్లవాడు ఏడ్చి ఏడ్చి ఏ రెండింటికో పడుకోనిచ్చాడు. పోనీ యేదో అప్పుడైనా ఆదమరచి నిద్రపోదామా అనుకుంటే, ఆసనుకు కాస్తా సాయిబుగాడుకు సన్నాయి సాధనతో చెడి పూరుకుంది. గోపాలం నిజానికి శాంత స్వభావం గలవాడు కాబట్టే తన దురదృష్టానికి ఇతరులను కర్తలుగా చేయలేదు. అతడు ఆలోచనా రహితుడై అలాగే పడుకున్నాడు. పెరటిలోని కొబ్బరి ఆకుల సందుల్లోంచి గాలిరివ్వుమని దూసుకుపోతూంది. మేష్టారు సీతారామయ్య సముద్రంలో స్నానంచేసి వచ్చి, సంధ్యావందనం గట్టిగా వల్లిస్తూ ఆదారిన పోతున్నాడు.

గోపాలం లేచి కూర్చున్నాడు, చిటికె వేసి ఆవులించాడు. ఒక్కసారి ఒళ్లువిరుచుకుని, ప్రక్కలోని చిరుగులకంబళి కుర్రవాడికి కప్పి, సన్నగా భార్యని పేరుపెట్టి పిలిచాడు. అప్పటికే ఆమె స్నానం కూడా ముగించి మండుతూన్న పొయ్యిముందు జుట్టు విడదీసుకుంటూ 'మేలుకొలుపులు' పాడుకుంటూంది. గోపాలం వంటిల్లు సమీపించి, "మాడు వెళ్ళబోయేది చెల్లెలి యింటికి చెయ్యబోయేది రాచకార్యం. ఈ వేళ కాఫీ దానికి అనుగుణ్యంగా వుండాలి. ఇదిగో అయిదు నిముషాలలో వస్తున్నాను" అని నిష్క్రమించాడు. అతడు తిరిగి వచ్చేసరికి గృహలక్ష్మి ఓ తవ్వెడు కమ్మటికాఫీ గ్లాసులో పెటీవుంచింది. గోపాలం దాన్ని గడగడా త్రాగి, తేల్చి, చేపాటికర్ర చంకన బెట్టుకొని, సంచీ చేతికి తగిలించుకుని రోడ్డు ఎక్కాడో లేదో, బస్సు సిద్ధంగా వుంది. గోపాలం ఎక్కడమే తడవు దుమ్ము రేపుతూ బస్సు కదిలింది.

గోపాలం చెల్లెలు రాజమ్మని చూసి ఎనిమిదేళ్లయింది. పెళ్లి అయిన తర్వాత ఆమె తిరిగి ఇక్కడకు రాలేదు. తాను అంతకన్నా పోలేదు. ఏం దగ్గర ప్రయాణాలా ఇప్పుడెక్కితే ఇంకోగంటకి దిగడానికి? బెంగుళూరెక్కడ-బెంతమూర్లంక ఎక్కడ?

## జయంతి శ్రీరామమూర్తి

ఆపైన ఆమెకు అక్కడ జరిగినట్లు ఇక్కడ జరుగుతుందా? "ఇది ఒకందుకు మంచిదే, నా దారిద్ర్యాన్ని చూసే అవకాశం ఆమెకు కలగలేదు" అనుకున్నాడు గోపాలం. ఈనాడంటే తానిలా అయిపోయియాడు గాని తమదీ ఒకప్పుడు బ్రతికిన సంసారమే. అందుకనే 'నా' అన్న వాళ్లెవరూ లేక పోయినా, వున్న రెండెకరాలూ అమ్మేసి రాజమ్మ పెళ్ళి దూమ్‌ధామ్‌గానే చేశాడు గోపాలం.

రైలు గుంతకల్లు దాటి క్షణ క్షణానికీ బెంగుళూరికి దగ్గర పడుతూంది. గోపాలం పై బెర్తులో కాళ్లుచాపుకు పడుకున్నాడే గాని నిద్ర అన్నది దగ్గరకు రావడంలేదు. ఇంక ఒక్కరాత్రి!! తెల్లవారితే రాజమ్మని చూడవచ్చు. చిన్నప్పుడు చిలిపి చేష్టలు చేసిన రాజమ్మ. తాటి ముంజెలకు మారాం చేసి తన ఒడలంతా రక్కివేసిన రాజమ్మ. అన్నట్లు బెంగుళూరులో తాటి ముంజెలు దొరుకుతాయా? ఆమె ఈనాడు లక్షాధికారి భార్య. బెంగుళూరు వెళ్ళవచ్చిన తన మిత్రులందరూ ఆమె సౌభాగ్యాన్ని ఎంతో పొగిడారు. విశాలమైన భవంతి, కార్లు, వంటవాడు, నౌకర్లు, చాకర్లు...రాజమ్మ వెనకటిలా వుందో, లేదో? ఎలా వుంటుంది. ఇప్పుడామె ఇద్దరు పిల్లల తల్లి, తనంత సవితి కొడుకు, పాపం, రెండోపెళ్లివాడికిచ్చి తాను చెల్లెలి గొంతుకోయ్యలేదు గదా! లేదు, రామయ్య యేమంత ముసలివాడూ, ముడికివాడూ కాదు. గోపాలం బుర్రలో మళ్ళీ ఒక సందేహం పొడసూపింది. తన కూతురిపెళ్ళి రాజమ్మ సవితి కొడుకుతో చెయ్యాలని గదా తనకోరిక! ఇది సాధ్యమవుతుందా? తానేం కట్నమియ్యగలడు? అలాయిచ్చే స్తోమతువుంటే ఇంతదూరం ప్రయాణమెందుకు? మళ్ళీ అతనికి సుబ్బారాయుడు జ్ఞాపకం వచ్చాడు. అయితే అతడూ వయసుకు చిన్నవాడేగాని చేసేవృత్తి సైకిలుషాపు. ఇలాంటివృత్తి తన యింటా వంటా లేదు. అందుకే కుర్రదీ, కుర్రదాని తల్లీ వొప్పుకున్నా, తాను వొప్పుకోలేదు. గోపాలం ఒక్కసారి తల ఝాడించాడు.

"ఏమిటీ భ్రమ? కుర్రది నా కూతురు, అంటే రాజమ్మకి సాక్షాత్తూ మేనకోడలు. కుర్రవాడామె కుమారుడు. రాజమ్మ లక్షాధికారిణి కావచ్చు. కాని మొదట నా చెల్లెలు గదా! తన మేనకోడలంటే ఆమెకంత బాధ్యత వుండదా? ఏది ఏమైనా ఈ సంబంధం రైటు చేసి తీరుతాను" అనుకున్నాడు గోపాలం.

బెంగుళూరులో రైలు దిగగానే సంచీ చేతికి తగిలించుకుని జట్కాలో ఎక్కి కూర్చున్నాడు గోపాలం. రాజమ్మని చూడాలనే తహతహ అతని తొందరచేస్తూ వుంది. తిన్నగా "శంకరపురం, నాలుగో క్రాసు" అన్నాడెల్లాగో. జట్కా టకటకా నడుస్తూపోతూంది. బాలభానుని స్వర్ణకాంతిలో వేలాది జనం తమదైనందిన చర్యలకు అటూ యిటూ యంత్రాల్లాగా నడచి

పోతున్నారు. వాళ్లలో చాలామంది చిర పరిచితులలాగ కనుపించారు. గోపాలం బహుశా వాళ్లని కలలో చూసివుంటాడు! జీవితంలో ఒక్కొక్కప్పుడు ఏది నిజమో, ఏది స్వప్నమో తేల్చుకోవడం కష్టం. నిజానికి గోపాలం జీవితం అంతే. జట్కా వచ్చి ఒక విశాలభవనం ముందు ఆగేవరకూ గోపాలం అలాగే కలలు కంటున్నాడు. అందమైన గేటు ప్రక్కన చలువరాతిపలకపై "రాజ్యలక్ష్మీనిలయం" అన్న అక్షరాలు అతనిదృష్టిని ఆకర్షించాయి. నిజానికి రాజమ్మయిల్లు ఇంతపెద్దదని అతనికి తెలియదు. జట్కా వెళ్లిపోయింది. కాసు ప్రక్కన అటూయిటూ పచారు చేస్తున్నాడేగాని లోనికి వెళ్లడానికి ధైర్యం చాలలేదు గోపాలానికి. ఆఖరికి ఎలాగో తెగించి లోపల అడుగు పెట్టబోయేసరికి "ఎవరు మీరు?" అన్నాడు గూర్ఖావాడు.

"నేను మీ అయ్యగారి బావమరిదిని" ...గోపాలం. "ఏమిటి నిదర్శనం? కార్డు వుందా?" అన్నాడు గేటుకీపరు. గోపాలానికి తలకొట్టివేసినట్లయింది. అతగాడితో ఎలా వాదించడం? బహుశా తన యజమాని బావమరిదికి కూడా కారువుండి తీరాలని అతని వూహా కాబోలు! అటువంటి పరిస్థితులలో "ఏం పరీక్షిస్తున్నావురా భగవంతుడా" అని ఒక్కసారి ఉస్సురన్నాడు. ఇంతలో దేవుడే పంపినట్లు ఓ బిస్కట్‌రంగు కారు లోపల ప్రవేశించడమూ, కాపలావాడు సలాం పెట్టడమూ జరిగింది. గోపాలం ఒకసారి "బావగారూ!" అని అరుస్తూ లోనికి పరుగెత్తాడు కారు వెంబడి.

గోపాలానికి ఆయింట్లో స్వాగతం బాగా జరిగిందని చెప్పాలి. అతనికి ప్రత్యేకంగా మేడమీద గది బసగా యిచ్చారు. అన్నివేళలా ఇద్దరు మనుషులు అతనికేం కావాలో పని కట్టుకు చూస్తుండేవారు. నిజానికి వాళ్లు ఆ స్తరూపం తనను కనిపెట్టుకు వుండడం నచ్చలేదు గోపాలానికి. తాను వచ్చిన పని చేసుకు పోవాలనివుంది. కాని, రాజమ్మ దర్శనం దొరకడం కష్టంగావుంది. ఆమె ఉదయం భర్తప్రక్కన కనుపించిందే గాని చిరునవ్వు విసిరి వూరుకుంది. యోగక్షేమాలు బావగారే ప్రశ్నించేరు.

సాయంకాలం అతడు నిద్ర లేచేసరికి కాఫీ ట్రేలోవచ్చి టేబిలుమీద వుంది. అతడు లేచి బట్టమార్చుకుని, "మీ అమ్మగారు క్రిందవున్నారా?" అన్నాడు పనిమనిషితో.

"లేరు. అయ్యగారితో పార్టీకి వెళ్లారు" అని జవాబు.

గోపాలం తిరిగి ప్రశ్నించలేదు. కాఫీ త్రాగి వరండాలో అటూ యిటూ పచారు చేస్తుండగా డ్రైవరు వచ్చి "మిమ్మల్ని ఊరంతా త్రిప్పమన్నారు అయ్యగారు. కారు సిద్ధంగావుంది, రండి" అన్నాడు. గోపాలం మనసు కారులో కూర్చున్న తరువాతకూడా స్థిమితపడలేదు. రెక్కలు కట్టేసిన పక్షిలా, బందాలు బిగించిన పశువులా, సంకెళ్ళుపడ్డ ఖైదీలా బాధపడుతున్నాడు. అతని బుర్రలో కూతురు పెళ్ళి విషయం కరుడుగట్టే వుంది. ఆ విషయం రాజమ్మతో సంప్రతిస్తేగాని తేలదు. కాని రాజమ్మ పూర్తిగా మారిపోయింది. ఇప్పుడామె వెనకటి మనిషి కాదు, సమాజపు ఉన్నత శ్రేణిలో సభ్యతా, ఆభిజాత్యమూ కలిసి పెట్టిన ఒరవడిలో నడిచే వనిత. "ఆమె జీవితంలో వికట వినోదాలకీ, కుటుంబ ప్రేమల పాలపొంగులకీ స్థానం లేదు. ఎంత పరివర్తన? దినమల్లా గదిలో పడివున్న నన్ను ఒక్కసారి అయినా చూడరాలేదు," అనుకున్నాడు అన్నగారు.

రాత్రిభోజనం చేసి మేడ ఎక్కేముందు వంటవాణ్ణి "మీఅయ్యగారు ఎప్పుడొస్తారు" అన్నాడు.

"ఎవరికి తెలుసు?"పదికావచ్చు,పన్నెండు కావచ్చు. వెళ్ళినది గొప్పవారియింటికిగదా! అక్కడికి మంత్రులూవాళ్ళూ వస్తారు"అన్నాడతడు. గోపాలం పైకిఎక్కి మంచంమీద వ్రాలాడు. ఆమంచం స్ప్రింగులు అతనిని పైకీ, క్రిందికీ వూపుతున్నాయి. గోపాలానికి తనయింటిలోని కుక్కిమంచం జ్ఞాపకం వచ్చింది. రక్తం ఒకటైనా అదృష్టయోగంలో తనకీ చెల్లెలికీ ఎంత భేదం? తానే గనక ఆ రెండెకరాలూఅమ్మి కట్నం ఇవ్వక పోతే రాజమ్మ ఈ మేడఎక్కేదా? తన మతిభ్రమణానికి తానే నవ్వుకున్నాడు గోపాలం. లేచి పైనున్న గాలి పంఖా కట్టేశాడు. అతన్ని కలవరపెటిన చిక్కల్లా ఒక్కటే "ఎలాగమా అమ్మాయిని ఈయింట చేర్చగలను?"

పెద్దకారువచ్చి పోర్టికోలో ఆగేసరికి గోపాలం ఇంకా మేలుకొనేవున్నాడు. దొంగచాటున పైనుండి చూస్తున్నాడు. రాజమ్మా, భర్తా ఠీవిగా కారుదిగి లోనికివచ్చారు. పనివాళ్లు అలజడిగా నలువైపులా తిరుగుతున్నారు. భార్యాభర్తలు వెళ్ళి పెరట్లో వేసిన పడకకుర్చీలలో వ్రాలారు. గోపాలం ఇదేసమయమని క్రిందికిదిగాడు. అతన్ని చూసీ చూడగానే బావ "రావయ్యా మహాశయా! పాపం, నీతో మాట్లాడలేక పోతున్నాం. ఏదో ఈ పెళ్ళిసంబంధం గొడవలో ఊపిరిపీల్చేందుకుకూడా వీలు లేదు" అన్నాడు.

"పెళ్ళిసంబంధమా? ఎవరికి—"

"ఇంకెవరికి, మావాడికే"అంది రాజమ్మ.

"ఇప్పుడే చూసివచ్చామయ్యా! పిల్ల రంభలావుంది మంత్రిగారి మేనత్త మనమరాలు. ఒక్కతేపిల్ల. రెండువందల ఎకరాలకి అధికారిణి ఏనాటికైనా" అన్నాడామె భర్త. గోపాలానికి ఏమీ వినాలని లేదు. తానువచ్చినపని అటో, యిటో తేలి బుర్ర తేలికయింది.

"మావాడికేంగాని, కమలా ఈపాటికి ఎదిగివుంటుంది. ఏమన్నా చూస్తున్నావా లేదా?" అంది చెల్లెలు.

"ఏదో" అని చప్పరించాడు గోపాలం.

"ఇంకో రెండువేలు ఎక్కువయినా కాస్త మంచిసంబంధమే చెయ్యవయ్యా" అన్నాడు బావ. గోపాలానికి ఈ వృథా ధర్మోపదేశాలు వినాలని లేదు. వెంటనే నిద్ర వస్తూందని పైకివెళ్ళిపోయాడు.

మరునాటి ఉదయమే గోపాలం తిరుగు ప్రయాణం పెట్టేశాడు. వాళ్లు ఇంకా వుండమన్నా అతడువినలేదు. నిప్పుకీ నీళ్ళకీ కలయిక లేదని తేల్చేసుకున్నాడు. నీళ్ళకి దూరంగావుంటేనే నిప్పు ప్రకాశిస్తుంది! మూడోరోజు పన్నెండుగంటలకు గోపాలం స్వగ్రామపు పొలిమేరల్లో అడుగుపెట్టాడు. ఎందుకో అప్పటివాతావరణమంతా మారిపోయి కోమలంగా కనిపించింది. అలా కాస్సేపు సైకిలుషాపులోకూర్చుని, తిరిగి యింటివైపు నడకసాగించాడు. అంతవేగం తిరిగివచ్చిన గోపాలాన్ని చూసి, ఆశ్చర్యపడి భార్య "ఏం-సంబంధం స్థిరంచేసివచ్చారా" అంది ఆత్రంతో.

"ఆహా! మనం ఇక పెళ్ళిపనులు మొదలు పెట్టవచ్చు. ఒక్కమాట సుమా! నేను రైటు చేసినది సైకిలుషాపు సుబ్బారాయుడు సంబంధం," అని అరుగుమీద చిటికెలపడ్డాడు గోపాలం. లోనుండివింటున్న కమల అమాయికపుకళ్లు ఆనందంతో మిలమిలలాడాయి. ★

